సాక్షి
వికారాబాద్
శనివారం । 12 । అక్టోబర్ । 2024



కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆరోపించారు. 6లో▸



'దసరా' కిటకిట

విజయదశమి పండుగను పురస్కరించుకుని జిల్లాలోని మార్కెట్లు, కిరాణ, వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. 6లో▸



హైందవ చైతన్యమే ముఖ్యం

ఆర్‌ఎస్‌ఎస్ శత సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా యాలాలలో పథ సంచలన్ కార్యక్రమం నిర్వహించారు. 7లో▸

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు



స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: జిల్లా ప్రజలకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పవిత్రంగా నిర్వహించారని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అన్నారు. కుటుంబసభ్యులతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకోవాలని స్పీకర్ ఆకాంక్షించారు.

రేపు కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి రాక

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం కొడంగల్‌కు వస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ప్రతి ఏడాది మాదిరిగా దసరా పండుగ మరుసటి రోజు నియోజకవర్గ ప్రజలను కలిసి శుభాకాంక్షలు చెప్పడానికి వస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని లాహోటీ కాలనీలో ఉన్న ఆయన నివాసంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ నెల 12న సీఎం రేవంత్ సొంత గ్రామం వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో జరిగే దసరా వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడ పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం కొడంగల్‌కు బయలుదేరి వస్తారని అన్నారు. ఆదివారం ఉదయం కొడంగల్‌లోని ఆయన నివాసంలో ప్రజలను కలుస్తారని పేర్కొన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో మహిళలు

దుద్యాల్: మండలంలోని హకీంపేట్‌లో వెలసిన శ్రీ రాకమకొండ వేంకటేశ్వర స్వామి, సరస్వతీ దేవి ఆలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకం నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్తలు రాకం యాదయ్య, అరుణమ్మ తెలిపారు. లక్ష కుంకుమార్చన అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పట్టాలెక్కిన రాడార్

జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు 2012లోనే బీజం పడగా.. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని పుష్కర కాలం తర్వాత ప్రాజెక్టు ఓ కొలిక్కి వచ్చింది.. ప్రపంచంలోనే ఐదో అత్యాధునిక లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ఏర్పాటు పనులకు ఈ నెల 15న దేశ రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.



దామగుండం వద్ద నేవీ రాడార్ స్టేషన్ కోసం ఎంపిక చేసిన స్థలం

పుష్కర కాలం తర్వాత పరిష్కారం

- నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు 2011- 12లోనే బీజం
- ప్రభుత్వాలు మారడంతో తీవ్ర జాప్యం
- 15న శంకుస్థాపన చేయనున్న సీఎం, రక్షణశాఖ మంత్రి
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3,200 కోట్లు

వికారాబాద్: జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 15న శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పనులను ప్రారంభించనున్నారు. మంత్రి కొండా సురేఖ, స్పీకర్ ప్రసాద్‌కుమార్, జిల్లా ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు. శుక్రవారం అధికారులు దామగుండం అటవీ ప్రాంతాన్ని సందర్శించి శంకుస్థాపన ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెండు రోజుల క్రితమే హెలిపాడ్ పరిశీలించడంతో పాటు ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. ఏడేళ్ల క్రితం ప్రాజెక్టు ఏర్పాటుకు బీజం పడగా.. ఐదేళ్ల క్రితం పనులు ప్రారంభించే సమయంలో నిలిచిపోయింది. దేశ రక్షణ నిమిత్తం లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా దామగుండం రిజర్వ్ ఫారెస్టు పరిధిలోని 2,900 ఎకరాల భూమిని నేవీకి అప్పగించడానికి అటవీ శాఖ అంగీకరించింది. ఇందుకోసం ఫారెస్టు అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక గ్రామ పంచాయతీలతో పలు ఒప్పందాలు చేసుకున్నారు. కానీ బీఆర్‌ఎస్ హయాంలో ప్రాజెక్టు మరుగున పడి పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టులో కదలిక వచ్చింది. ఈ నెల 15వ తేదీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నారు. పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి, నేవీ అధికారులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు.

2011లో ప్రక్రియ ప్రారంభం

దామగుండం సమీపంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు రూ. 3,200 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇందు కోసం జాతీయ, రాష్ట్ర స్థాయిలో 16 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉండగా, దాదాపు అన్ని అనుమతులు వచ్చాయి. దామగుండం నుంచి పరిగి సమీపంలో గల మల్లెమోనిగూడ గ్రామ శివారు వరకు ఉన్న అటవీ భూమి 2,900 ఎకరాలు కావాలని నేవీ కోరింది. 2011–12లో ప్రాజెక్టు ప్రక్రియ ప్రారంభం కాగా 2014లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ అంచనాకు వచ్చాయి. పనులు ప్రారంభించేందుకు వడివడిగా అడుగులు పడ్డాయి. అప్పట్లో ప్రభుత్వం మారడంతో ప్రాజెక్టు అర్ధాంతరంగా ఆగిపోయింది.

ప్రపంచంలోనే ఐదో అత్యాధునిక వ్యవస్థ

ప్రపంచంలోనే ఐదో అత్యాధునిక నేవీ రాడార్ వ్యవస్థ ఏర్పాటునకు జిల్లాలోని హైదరాబాద్ - బీజాపూర్ రహదారిలో గల దామగుండం అటవీ ప్రాంతం వేదికైంది. పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో ఉన్న జిల్లా కావడం.. వెనుకబడిన ప్రాంతంలో ఇలాంటి ప్రాజెక్టు ఏర్పాటు కావడం శుభ పరిణామమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రజా సంఘాలు, పర్యావరణ వేత్తలు రాడార్ స్టేషన్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. ఇదే సమయంలో పూడూరు, పరిగి, వికారాబాద్ మండలాలకు చెందిన 10 గ్రామాల ప్రజలకు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు చేకూరుతుందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. బీఆర్‌ఎస్‌తోపాటు కొన్ని ప్రజా సంఘాలు దీన్ని వ్యతిరేకిస్తున్నాయి.

రూ.3,200 కోట్లతో ప్రాజెక్టు

రాష్ట్ర రాజధానికి సరిగ్గా 65 కిలోమీటర్ల సమీప దూరంలో ఉండటంతో పాటు సముద్ర మట్టానికి 350కి పైగా మీటర్ల ఎత్తయిన ప్రాంతాన్ని నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ఇండియన్ నేవీ ఎంచుకుంది. ఎంపిక చేసిన భూమిలో రామలింగేశ్వర స్వామి ఆలయం ఉండటం, మొక్కలు తొలగించాల్సి ఉండటం సమస్యగా మారింది. ఈ ప్రాంతంలో తొలగించే మొక్కల స్థానంలో మూడు రెట్లు అధికంగా మొక్కలు పెంచేందుకు రక్షణ శాఖ.. రిజర్వ్ ఫారెస్టుకు రూ.133 కోట్లు చెల్లించింది.

ఘనంగా ఆయుధపూజ

అనంతగిరి: జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ నారాయణరెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఆయుధాలకు, వాహనాలకు పూజలు చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకోవడం అనవాయితీగా వస్తోందన్నారు. చేసే ప్రతి పనిలో జిల్లా ప్రజలకు, పోలీసులకు విజయం చేకూరాలని ఆకాంక్షించారు.



ఆయుధపూజలో ఎస్పీ నారాయణరెడ్డి, సిబ్బంది



సమీకృత గురుకులానికి భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన

- రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి
- సమీకృత గురుకుల భవన నిర్మాణానికి భూమిపూజ
- విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్ జైన్, కాంగ్రెస్ నేత తిరుపతిరెడ్డి

కొడంగల్: రాష్ట్రంలో అసమానతలను రూపుమాపి విద్యా వ్యవస్థను మెరుగు పర్చడమే సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు లక్ష్యమని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ శివారులో శుక్రవారం సమీకృత గురుకుల భవన నిర్మాణ పనులకు కలెక్టర్ ప్రతీక్ జైన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డితో కలిసి భూమి పూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా సమీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేశారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. పాత కొడంగల్ శివారులో 20 ఎకరాల స్థలంలో అధునాతనమైన భవనాలను నిర్మించడానికి అధికారులు తగిన చర్యలు తీసుకున్నారని అన్నారు. 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఉచిత వసతితో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తారని పేర్కొన్నారు. ఈ భవనాలను రూ.100 కోట్ల వ్యయంతో నిర్మిస్తారని చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు వివరించారు. తరగతి గదిలో డిజిటల్ స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ సెంటర్లు, లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కుల మత వర్గ అంతరాలు లేని విద్యా సాధంలో క్రీడలను ప్రోత్సహించేలా క్రికెట్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌తో పాటు బాస్కెట్ బాల్, టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వసంత్ నాయక్, ఈఈ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్, తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బాలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగానికి ప్రాధాన్యత

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరుతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 28 నియోజకవర్గాలకు గురుకుల పాఠశాలలను మంజూరు చేసిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. రూ.5 వేల కోట్లు వెచ్చించి ఏడాదిలోపు పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తోందన్నారు. గత పాలకుల వైఫల్యం కారణంగా విద్యావ్యవస్థ కుంటు పడిందన్నారు. ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఇందుకు తగినట్లు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కొడంగల్ ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం జిల్లా వాసులు అదృష్టంగా భావిస్తున్నారని అన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు మేలు జరుగుతుందని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని హామీ ఇచ్చారు.

అభివృద్ధికి సహకరించాలి: తిరుపతిరెడ్డి

నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అన్ని రంగాల్లో పురోగతి సాధించడానికి అధికారుల సహకారంతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను పేదలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో సీఎం సమీకృత గురుకులాలను మంజూరు చేశారని తెలిపారు. ఏడాదిలోపు పనులు చేసి వినియోగంలోకి తెచ్చే విధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.

క్లుప్తంగా

16న వివాదాస్పద భూ సర్వే

తాండూరు రూరల్: మండలంలోని ఓగిపూర్ సర్వే నంబరు 65లోని వివాదాస్పద నాపరాతి గని భూమిని ఈ నెల 16న సర్వే చేయనున్నట్లు మైనింగ్ ఏడీ సత్యానారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వేకు గనుల శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరక్టర్ హాజరవుతారని అన్నారు. మైనింగ్ సర్వేయర్, రెవెన్యూ సర్వేయర్లు వివాదాస్పద భూమిని సర్వే చేస్తారని తెలిపారు.

గ్యాస్ గోదాంలో తనిఖీలు



పెద్దేముల్‌లో వంట గ్యాస్ గోదాంను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దేముల్: మండల కేంద్రంలోని గ్యాస్ గోదాంను శుక్రవారం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మోహన్‌బాబు, ఏఎస్‌ఓ గణపతి, పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ సందర్శించారు. గ్రామం మధ్యలో గ్యాస్ గోదాం ఉందా? దూరంగా ఉందా? అనే విషయాన్ని పరిశీలించారు. గోదాంకు పంచాయతీ అనుమతి ఉందా అనే విషయంపై ఆరా తీశారు. తర్వలో ఇండియల్ ఆయిల్ కార్పొరేషన్ వారితో జాయింట్ ఎంక్వైరీ చేయనున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని వృద్ధురాలి మృతి

బొంరాస్‌పేట: ఎన్ని మందులు తాగినా నొప్పులు తగ్గడం లేదని మనస్తాపం చెందిన వృద్ధురాలు ఉరేసుకుని మృతిచెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని లోతికుంటతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎండీ రవూఫ్ వివరాల మేరకు.. లోతికుంటతండాకు చెందిన గిరిజన మహిళ ఊక్కిబాయి(60) ఏడాది కాలంగా మోకాళ్లనొప్పులు, కడుపునొప్పితో బాధపడుతోంది. వైద్యం కోసం చెట్ల మందులు తింటోంది. అయినా నయం కాకపోవడంతో ఇంట్లో దూలానికి ఉరేసుకొని చనిపోయింది. మృతురాలి కూతురు పాపిబాయి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించామని ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి కొడుకు ఇదివరకు చనిపోగా, భర్త హేమ్లానాయక్ ఉన్నాడు.

ఎరువుల నిల్వలు ఉంచండి

సహకార శాఖ జిల్లా అధికారి సుధాకర్

కందుకూరు: రైతుల అవసరాలకు తగినట్టుగా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉంచాలని సహకార శాఖ జిల్లా అధికారి సుధాకర్, సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు, అసిస్టెంట్ రిజిస్టార్ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం వారు మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలుకు తగిన పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. అనంతరం సొసైటీ పరిధిలో చేపట్టిన పనులను పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ జిల్లా అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆనంద్, సంఘం కార్యదర్శి నిమ్మ యాదగిరిరెడ్డి, సిబ్బంది మహేశ్, పర్వతాలు, రాకేశ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులపాలు

ఇబ్రహీంపట్నం/మాడ్గుల: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసై అప్పులపాలైన ఓ వ్యక్తి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. ఈ నిందితుడిని మాడ్గుల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఏసీపీ కేపీవీ రాజు కేసు వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లా డిండి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్(32) నగరంలో బీటెక్ పూర్తి చేశాడు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో నివసిస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైన ఆయన అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చేందుకు చెరుకుపల్లిలోని పొలాన్ని సైతం అమ్మేశాడు. ఈ క్రమంలో ఈ నెల 7న తన బొలెరో వాహనంలో మాడ్గుల మండలం పాత బ్రాహ్మణపల్లి నుంచి ఇర్విన్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో జెల్లి లింగమ్మ(70) ఎర్రమట్టి కోసం ఒంటరిగా వెళ్తుండడం గమనించిన శ్రీకాంత్ ఆమెను మాటల్లో పెట్టి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న మాడ్గుల సీఐ జగదీశ్, ఎస్‌ఐ నాగరాజు సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. బొలేరో వాహనం, బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, కానిస్టేబుల్స్ రాజశేఖర్‌రెడ్డి, సహదేవ్, రాజు, వినోద్‌ను ఏసీపీ అభినందించారు.



పెద్దేముల్ నుంచి తాండూరుకు తరలిస్తున్న అరటి చెట్లు



పెద్దేముల్: రైతులు సాగుచేస్తున్న బంతి

'దసరా' కిటకిట

- పండుగను పురస్కరించుకొని జోరుగా కొనుగోళ్లు
- మార్కెట్, దుకాణాల్లో సందడే సందడి

అనంతగిరి: దసరా పండుగను పురస్కరించుకుని వికారాబాద్‌లోని మార్కెట్, కిరాణ, వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. సొంత గ్రామాలకు ప్రజలు రావడంతో బస్టాండ్‌లు, చౌరస్తాలు ప్రయాణికులతో సందడిగా కనిపించాయి. గ్రామాలు, పట్టణాలు దసరా వేడుకలకు ముస్తాబయ్యాయి. పండుగను పురస్కరించుకుని ఆలయాలను అందంగా తీర్చిదిద్దారు. శుక్రవారం దుకాణాలు జనంతో కళకళలాడాయి. పలు కాలనీల్లో రావణ దహనం కోసం ఏర్పాట్లు చేశారు.

ఫుల్ గిరాకీ..

పెద్దేముల్: విజయ దశమి.. నవ రాత్రి ఉత్సవాలు.. బతుకమ్మ నేపథ్యంలో అరటి, గుమ్మడి పూలకు భలే డిమాండ్ కనిపించింది. శుక్రవారం మార్కెట్లో కిలో బంతి పూలు రూ.100 నుంచి రూ.120లకు, చేమంతి రూ.200, రెండు అరటి దుంగలు రూ.150- రూ.200, గుమ్మడి కాయ రూ.150- రూ.200 వరకు విక్రయించారు. పెద్దేముల్ మండలం గాజీపూర్, గోట్లపల్లి, ఇందూరు, తింసాన్‌పల్లి, బుద్దారం గ్రామాల్లో పండించిన గుమ్మడి, బంతి, అరటి చెట్లను తాండూరు, వికారాబాద్, హైదబాద్ ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించారు.



వికారాబాద్‌లోని ఓ వస్త్ర దుకాణంలో కొనుగోళ్లు



పెద్దేముల్: విక్రయానికి సిద్ధంగా గుమ్మడికాయలు

'రియల్' మబ్బులు వీడేనా?



మోమిన్‌పేటలో ఏర్పాటు చేసిన నూతన వెంచర్

- అగ్రిమెంట్ల వద్దే ఆగిన భూముల క్రయవిక్రయాలు
- ఏడాదిన్నర కాలంగా ఇదే పరిస్థితి
- దసరా నుంచైనా మంచి రోజులు రావాలని ఆశిస్తున్న వ్యాపారులు

మోమిన్‌పేట: ఏడాదిన్నర కాలంగా రియల్ వ్యాపారంపై మబ్బులు కమ్ముకున్నాయి. ఎంతో మంది వ్యాపారులు అప్పులు చేసి కొనుగోలు చేసిన భూములు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. చాలా వరకు అగ్రిమెంట్ల వద్దే ఆగిపోయాయి. గంతలో ప్రతీరోజు మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో 40వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం రోజుకు 6దాటడం లేదు. అవి కూడా గుంటల్లో కావడం గమనార్హం. నాలుగైదేళ్ల క్రితం రూ.లక్షలు పలికి ఎకరా భూమి.. గతేడాది వరకు రూ కోట్లకు చేరుకుంది. నాలుగేళ్లలో భూముల ధరలు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో సిండికేట్‌గా మారిన కొంతమంది వ్యాపారులు అప్పులు చేసి భూములు కొనుగోలు చేశారు. రియల్ ఎస్టేట్ రంగం ఒక్కసారిగా పడిపోవడంతో ఏం చేయాలో తోచక ఆందోళనకు గురవుతున్నారు. మోమిన్‌పేట మండలంలో రియల్ భూమ్ ఎవరికీ అందనంత ఎత్తుకు చేరింది. పెట్టిన పెట్టుబడికి పదుల రెట్ల లాభాలు వచ్చాయి. రెండేళ్ల క్రితం ఏన్కతల గ్రామంలో 1,100 ఎకరాలలో మొబిలిటి వ్యాలీ కంపెనీ ఏర్పడనుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం భూ సేకరణ చేపట్టింది. దీంతో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఏడాది క్రితం 111 జీవోను ఎత్తి వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మండలంలో రియల్ వ్యాపారం దెబ్బతింది. వెంచర్లు ఏర్పాటు చేసిన చాలా పంచాయతీల్లో ప్లాట్ల క్రయవిక్రయాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గతంలో మండల పరిధిలోని ఏ గ్రామంలోనైనా రోడ్డు పక్కన ఎకరా భూమి రూ.కోటిపైనే పలికింది. మోమిన్‌పేట- శంకర్‌పల్లి మార్గంలో రూ.4 కోట్లపైనే పలికింది. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా స్థిరాస్తి వ్యాపారం పురోగతి దిశగా అడుగులు వేయడం లేదు. దసరా తర్వాత నుంచైనా పరిస్థితిలో మార్పు రావాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోరుకుంటున్నారు.

మానసిక ప్రశాంతతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: మానసిక ప్రశాంతతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసికంగా ఒత్తిడికి గురికావద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. అనంతరం సైక్రియాటిస్టు సాయిప్రశాంతి మాట్లాడుతూ.. చిన్న చిన్న సమస్యలకు ఆందోళన చెందరాదన్నారు. కుటుంబ సభ్యులు, మిత్రులతో సంతోషంగా గడిపితే మానసిక ఆందోళన నుంచి దూరం కావచ్చని అన్నారు. మానసిక సమస్యలు ఉన్న వారు టోల్ ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శృతిదూత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

వైద్య కళాశాల ఏర్పాటు చేయండి



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: షాద్‌నగర్‌లో వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్‌కు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తే దేశం మరింత ముందుకుసాగుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా షాద్‌నగర్‌లో వైద్య, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ గురుకులాలను ఒకే గొడుగుకిందకు తెచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ఆలోచన మంచిదేనన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉమ్మడి కొందుర్గు మండలాన్ని విభజించి, నూతనంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలాన్ని ఏర్పాటు చేసిందని, కాని సౌకర్యాలు మరిచిందని విమర్శించారు. కొత్త మండలానికి కనీసం ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఏర్పాటు చేయలేదని, నేటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని వాపోయారు. కనీసం పీహెచ్‌సీ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. అత్యంత ఎత్తైన షాద్‌నగర్ నియోజకవర్గంలోని లక్ష్మదేవిపల్లిలో పాలమూరు ప్రాజెక్టు నిర్మాణం చేస్తామని గొప్పలు చెప్పిన నాటి ప్రభుత్వం.. ఆ ప్రాజెక్టును పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రాజెక్టును నిర్మించి, ఈ ప్రాంతాన్ని సశ్యశ్యామలం చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కలెక్టర్ శశాంక్, పరిగి ఎమ్మెల్యేరాం మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి,కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి, నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, కావలి రాజు, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి



చంద్రయ్య(ఫైల్)

పరిగి: మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సయ్యద్‌మల్కాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్యాట చంద్రయ్య(40) అద్దె ఇంట్లో తల్లితో కలసి ఉంటున్నాడు. 15 సంవత్సరాల క్రితం భార్యతో విడిపోయాడు. తాగుడుకు బానిసై ఆరోగ్యం పాడుచేసుకున్నాడు. గురువారం రాత్రి 8గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తల్లి చుట్టుపక్కల వెతికింది. మరుసటి రోజు ఇంటి వద్ద ఉన్న మురుగు కాలువలో యాదయ్య కాళ్లు కనిపించాయి. దీంతో చుట్టుపక్కలి వాళ్లను పిలిచి చూడగా అప్పటికే మృతి చెందాడు. మద్యం మత్తులో ఇంటికి వస్తూ కాలు జారి మురుగుకాలువలో పడి మృతి చెందినట్లు తెలిసింది. తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మైనర్ దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ మైనర్ దుర్మణం చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని దేవునిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ గోపాల్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని దేవునిపల్లికి చెందిన అన్నదమ్ములు జశ్వంత్, ఓంకార్, మరో యువకుడు వంశీ(16) బైక్‌పై చించోడ్ వెళ్తున్నారు. అదే మార్గంలో ఓ ట్రాక్టర్ వెళ్తోంది. ఈ క్రమంలో డ్రైవర్ కృష్ణయ్య ట్రాక్టర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల వస్తున్న బైక్ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న వంశీ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. జశ్వంత్, ఓంకార్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి తల్లి అంజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

- పథకాల అమలులో ప్రభుత్వం విఫలం
- తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నలుగురు బ్రదర్స్.. తాండూరులో ఇద్దరు బ్రదర్స్ ప్రభుత్వ పాలనను భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతుబీమా, రైతు బంధు పథకాలను ప్రతి ఏటా సమయానికి అందించామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు అనేక హామీలు ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా వెనుకబడి పోయిందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ఆపేశారని అన్నారు. తాండూరు అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాండూరు బైపాస్ రోడ్డు పనులను 90 శాతం మేర పూర్తి చేశామని, మిగిలిన 10శాతం పనులను పూర్తి చేయడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. పారిశ్రామికవాడ, లారీ పార్కింగ్ పనులు పెండింగ్‌లో పెట్టారన్నారు. పట్నం మహేందర్‌రెడ్డి చీఫ్‌విప్ పదవి కోసం పాకులాడటం సిగ్గుచేటన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో మల్కాజ్‌గిరిలోనే ఉంటానన్న ఆయన మళ్లీ తాండూరుకు వచ్చి రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. మహేందర్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ తగ్గిందని.. ఇప్పటికైనా ప్రజల నుంచి గౌరవం దక్కాలంటే రాజకీయాలకు దూరంగా ఉండాలని హితువు పలికారు. తాండూరును ఇసుక మాఫియాకు, మట్టి అక్రమ రవాణాకు నిలయంగా మార్చారన్నారు. చిలుక వాగు ప్రక్షాళన కోసం తాను నిధులు తెస్తే.. ప్రస్తుత ఎమ్మెల్యే పనులు చేయించడం లేదన్నారు. ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నయిం, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సలీం, మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నరేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

- హరిదాస్‌పల్లి బస్టేజీ వద్ద ప్రమాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు



ప్రమాదంలో గాయపడిన తరుణ్



ధారాసింగ్

ధారూరు: అతివేగంగా వెళ్తున్న కారు ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం మండల పరిధిలోని హరిదాస్‌పల్లి బస్టేజీ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరంపూర్‌తండాకు చెందిన తరుణ్, ధారాసింగ్ బైక్‌పై వికారాబాద్‌కు వెళుతున్నారు. హరిదాస్‌పల్లి గేట్ వద్ద ఉన్నపంపులో పెట్రోల్ పోసుకునేందుకు బైక్‌ను స్లోచేయగా.. వెనక నుంచి వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సన్మానం



రాజేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న మురహరి వశిష్ట



సుధాకర్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న నాయకులు

కొడంగల్: వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, వికారాబాద్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధాకర్‌రెడ్డిని సామాజిక కార్యకర్త, కొడంగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట శుక్రవారం ఘనంగా సన్మానించారు. కొంగల్ నియోజకవర్గానికి చెందిన రాజేశ్‌రెడ్డి, విజయకుమార్, సుధాకర్‌రెడ్డి గతంలో రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేశారు. ఆయన విజయానికి తమవంతు కృషి చేశారు. వీరి సేవలను గుర్తించిన సీఎం ఇద్దరికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులు కట్టబెట్టారు. మరొకరికి వికారాబాద్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో మురహరి వశిష్ట ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థచారి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మునీర్, ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భీంరాజు, మిఠాయి రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు



కృష్ణంరాజుకు రసీదు ఇస్తున్న డాక్టర్ రవీంద్రయాదవ్

కొడంగల్: పట్టణ శివారులో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తమవంతు సహకారంగా విరాళాలు ఇచ్చారు. శుక్రవారం యువజన కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్త కృష్ణంరాజు రూ.లక్ష నగదును ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్ర యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతిగౌడ్, నర్సిరెడ్డి, కిషన్‌ధాగలకు అందజేశారు. బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో బీజాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన అయ్యప్ప స్వామి ఆలయం నిర్మిస్తున్నారు. ఈ మేరకు నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. అలాగే కొడంగల్ కార్గిల్‌కాలనీకు చెందిన చామంతి ప్రభాకర్, అన్నారం మాజీ సర్పంచ్ అనితాపకీరప్పలు కొంత మొత్తం నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

సైబర్ నేరాల నియంత్రణపై నజర్

- ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- కళాజాత ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం



దౌల్తాబాద్‌లో సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దౌల్తాబాద్/ధారూరు: ఇటీవల సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. టెక్నాలజీని వినియోగించుకుని అనేక మంది సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను దోచుకుంటున్నారు. దీంతో పోలీసులు సైబర్ నేరాలపై దృష్టి సారించారు. ప్రజలు వారి వలలో పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సెల్‌ఫోన్, వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో వచ్చే అనవసరమైన లింకులను క్లిక్ చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. అపరిచిత వ్యక్తులతో ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో చాటింగ్, కాల్‌వంటి వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

బ్యాంకు నుంచి చేస్తున్నాం...

సైబర్ నేరగాళ్లు ప్రజలను సులువుగా దోచేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త పంథాలో బురిడీ కొట్టిస్తున్నారు. నిరక్షరాస్యుల నుంచి విద్యావంతుల వరకు అందరి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు లాగేస్తున్నారు. మేము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం. మీ ఆధార్ నంబరు చెప్పండి. మీ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పండి. మీ ఏటీఎం పనిచేయడం లేదు. మీకు లింకు పంపించాం. ఓకే చేయండి అంటూ వివిధ రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తున్నారు.

1930 టోల్ ఫ్రీ నంబర్

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలే కాకుండా ట్రాఫిక్ నియమాలు, వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దౌల్తాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు పల్లెల్లో ప్రజలకు అవగహన కల్పిస్తున్నారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలు ధరించకుంటే కలిగే ప్రమాదాలను వాహనదారులకు తెలియజేస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి ఎంసీఆర్‌పీలో వివరాలు అప్‌లోడ్ చేస్తే 24గంటల్లోనే అమౌంట్ రిటన్ వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీసులు పేర్కొంటున్నారు. సైబర్ నేరానికి గురైన వారు వెంటనే పోలీసులు ఆశ్రయించాలని సూచిస్తున్నారు.

లింక్ తెరిస్తే అంతే

గ్రామీణులను టార్గెట్ చేసుకుని మాయమాటలు చెప్పి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఫోన్లకు మెస్సేజీలు పంపిస్తూ ఉన్నకాడికి దోచేస్తున్నారు. నేరగాళ్లు పంపిన లింక్ ఓపెన్ చేయగానే అకౌంట్లలోని డబ్బులు క్షణాల్లో మాయమవుతాయి. వినియోగదారుల వివరాలు తెలుసుకున్నట్లు భయపెట్టి, ఐటీ రైడ్స్ అంటూ భయపెడతారు. నేను మీ ఎస్‌ఐని లేదా సీఐని నాకు డబ్బులు అత్యవరం ఉంది నా నంబర్‌కు రూ.50 వేలు పంపించు అని ఫోన్ చేస్తారు. ఇటీవల ఎస్‌ఐ పేరుతో ధారూరు మండలంలోని ఓ సేవ కేంద్రం నిర్వాహకుడిని బురిడీ కొట్టించారు. డబ్బులు పంపిన తర్వాత అసలు విషయం తెలుసుకుని లబోదిబోమన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్యాష్ బ్యాక్ ఆఫర్లు, మొబైల్ డాటా ఫ్రీ, పర్సనల్ లోన్స్, క్రెడిట్ కార్డ్ అంటూ ఫోన్లు చేసి మోసాలకు పాల్పడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



సైబర్ నేరగాళ్ల చేతిలో ఎవరూ మోసపోకుండా అవగాహన కల్పిస్తున్నాం. బ్యాంకు నుంచి ఫోన్ చేశామని ఓటీపీ చెప్పాలంటూ కాల్స్ వస్తే స్పందించకూడదు. బ్యాంకు నుంచి అధికారులెవరూ ఫోన్లు చేయరు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.

– రవిగౌడ్, ఎస్‌ఐ, దౌల్తాబాద్